## ::కాలచక్రం::

రచన : శ్రీధరరెడ్డి బిల్లా

“నిన్న అట్లెట్లు జరిగిపోనేల?” యనుచు
నిన్నటి దినమున్ నిందించి నీల్గుటేల?
నేడు నడుమొద్దు నిన్నటి నీడలోన
'నిన్న', 'రేపు' లను విడిచి , ‘నేడు’ గడుపు!

అలిగి నిన్నటి పగలను తలచుకుంటె
అవిటిచేయి  కూడా నొక ఆయుధమగు!
సామరస్యము సాధించి సాగిపోతె,
గిరులఁ దొలచి బాంబులు కూడ దారివేయు !

లేనితనమొక కాలము రెచ్చియున్న
జీవితమది పరిపూర్ణత చెందగలదు !
పాటకందము శబ్దమొకటియె గాదు,
శబ్ద శబ్దాన్కి మధ్య నిశ్శబ్దమూను !

నేడు ఉచ్ఛస్థితికెపుడు మిడిసిపోకు
నిన్న నీతలపై నెత్తునున్న ఆకు
నేడది నెలవు గోల్పోయి నేల రాలి,
రేపటాకుకు వనరుగా రూపు మారు!

బాధలు, భయాలు ఎవరినీ వదలబోవు ,
ఎంత వారికైనానవి, ఎంచి వచ్చు.
భీతిచెందితే పీడించు భూతములగు!
చిరునగువుతోడ జూడుము చిన్నవగును!

కాలమది అప్పుడప్పుడు కటిక చేదు,

గాలమేసి పట్టుకొనునది గట్టిపట్టు!
నీదు సామర్థ్యమంతయు నీకు దెల్ప
కక్షగట్టినట్టుల నిన్ను కష్టపెట్టు!

అందరినెపుడు మెప్పింప నలవికాదు
ఒక్కని కథలోనైన నీవొక విలనువు!
రావణుడు తన కథ తాను వ్రాసుకుంటె ,
రాముడందున విలనుగా వ్రాయబడడె?

నేటి ఓటమి కష్టాల మూటజూచి
భీతిచెంది మనసులోన బెంగపడకు!
రేపొక దినము నగుచు నీ వైపుకొచ్చు!
హాలహలము వెన్క అమృతమొచ్చినట్లు!

ముక్కు మూపించె నిన్నటి మురుగునీరు
ఆవిరై నేడు ఎగసిల్లె ఆకశాన !
దప్పి తీర్చు రేపు వరుణధార గాను!
మనిషి కూడ కాలము బట్టి మారుచుండు!

అద్దమున జూచి నెత్తిన రుద్దుకొనుచు
బట్టతలను దలచుకుని బాధ యేల ?
పోవకుండ నిల్చినదేది పోల్చి జూడఁ ?
పుట్టి నట్టివి యావత్తు గిట్టు నెపుడు !

“నేను లేకున్న నెట్లొ?”నని భయమేల?
ఆగిపోక గతుకులతో సాగి పోవు !
‘చావు’ యది యెట్టిదో గాని, చావు కన్న
భయమది మహా భయంకర పాశమోయి !

జ్ఞాపకాల దొంతరలకు తీపి గుర్తు
గాను, ఫోటోలు తీశారొ కాలమపుడు!
ఎక్కడైనను ఫోటోలు నొక్కడమ్మొ
జ్ఞాపకంగా మిగిలినట్టి కాలమిపుడు !

"నా బతుకు ఛీఛి ఎందుకీ జాబు కూడ
దొబ్బె?" ననుచు బాధపడక నిబ్బరించి
వెళ్ళు . నీ పక్కనున్నది రాళ్ళ కుప్ప .
నిక్కముగ తాకవలసిన దొక్క రాయె!

యశము,అధికారముల కొరకు ఆత్రపడకు
జీవితాన ఆ మాయలో చిక్కుకుంటె,
వద్దని అనుకున్నప్పుడు వదలలేవు!
పోవుదామన్నా బరువును మోయలేవు

యవ్వనమున ఖర్చుకు చిల్లి 'గవ్వ'లేదు
నడివయసున తీరిక 'కాల'ఘడియలేదు.
ముదిమిన తిరుగుటకు 'శక్తి' పొసగలేదు.
బాధలేమియు లేనిది బాల్యమేను!

నీకు గల 'సమర్థత' యది, నొకరికేమి
మేలు జేయకున్నచొ దాని ఫలిత మేమి?
తాడు గట్టిదై, వేసిన ముడులు గట్టి
గాను లేకున్న దానుపకార మేమి ?

మొక్కగా ఉన్నపుడు నిన్ను త్రొక్కబూనె!
ఓర్చుకొని చెట్టయినపుడు త్రుంచబూనె!
మహిని గెల్చి మహావృక్ష మైనవేళ,

ఫలముకై, నీదు నీడకై పరితపింత్రు!

ఒకడు నీకు జేసిన మోసపు పని కన్న,
వాటినిన్ దలంచుట వల్ల బాధ హెచ్చు!
బాధ నీవు పడితె , వాని ఆశ తీరు!
మర్చిపోయి నవ్వు! బదులు తీర్చినట్లె !